పైప్ లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుమ్ పంచాయతీ పరిధిలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ గొట్టాలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ పోరం మండల అధ్యక్షుడు కే.హరి సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు వెంటనే స్పందించి పైపులైన్‌ను పునరుద్ధరించారు. వెంటనే స్పందించి పునరుద్ధరించిన బిఎస్ఎన్ఎల్ శాఖ సిబ్బందికు సర్పంచ్, ఆ పంచాయతీ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పైప్‌లైన్ బిగిస్తున్న సిబ్బంది

ఎర్రజెండా అండగా.. సిఐటియు పండగ..

- నేటి నుంచి విశాఖలో సిఐటియు 18వ అఖిల భారత మహాసభ
- ఊరూ వాడా ఎర్రెర్రని తోరణాల రెపరెపలు
- రాగల 3 ఏళ్లకు మహాసభల్లో కార్యాచరణ
- కార్మిక సమస్యలు, విశాఖ స్టీల్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, లేబర్ కోడ్స్‌పై పోరాటాలపై దిశా నిర్దేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే కార్మిక పోరాటాలకు కేంద్రం, ప్రభుత్వ రంగ సంస్థల నిలయం విశాఖ నగరం డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకూ జరుగు సిఐటియు అఖిల భారత 18వ మహాసభకు వేదికగా మారింది. ప్రపంచ కార్మిక సంఘాల ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్‌టియూ) ప్రతినిధి పంబిస్ కిరిట్సిస్ బుధవారం ఉదయం 9.30గంటలకు జ్యోతిని సాగర తీరం ఆర్‌కె.బీచ్‌లోగల ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు తీసుకొస్తారు. అనంతరం అక్కడ సిఐటియూ ఆలిండియా అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత జెండా ఆవిష్కరణతో మహాసభలు ప్రారంభం కానున్నాయి.

సిఐటియు అఖిలభారత 17వ మహాసభలు 2023లో బెంగళూరులో జరిగాయి. ప్రతి 3ఏళ్లకూ ఒకసారి జరిగే జాతీయ మహాసభలకు ఈ సారి విశాఖ వేదికకావడం కార్మికవర్గ పోరాటాలకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఎంతో తోడ్పాటునివ్వనుందని అభుదయ వాదులంతా భావిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై నాలుగేళ్లకు పైగా కార్మిక పోరాటాలు జరుగుతున్నాయి. కేంద్రం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌పై పోరాటాలకూ ఈ మహాసభలు పిలుపునివ్వనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక విధానాలపై ఈ మహాసభల్లో చర్చించి రాగల మూడేళ్లకు ఉద్యమ కార్యాచరణకు సిఐటియు సిద్ధమవుతోంది.

ఎర్రెర్రని తోరణాలు

నగరంలోని ప్రధాన కూడళ్లన్నీ ఎర్రెర్రని తోరణాలతో మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులకు, ప్రారంభ సభకు స్వాగతం పలుకుతున్నాయి. జాతీయ మహాసభల ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 6గంటలకు విశాఖ సాగర తీరంలో 'రెడ్ షర్ట్ వాలంటీర్ల' కవాతు సర్వత్రా ప్రజలను ఆలోచింపజేసింది. మహాసభలు జరిగే హాల్‌కు బాసుదేవ ఆచార్య, ఎంఎన్ లారెన్స్‌గా వేదికగా నామకరణం చేయగా, మహాసభల ప్రాంగణానికి కామ్రేడ్ అనంతలవటమ్ ఆనందన్‌నగర్ పేరు పెట్టారు. జనవరి 4న మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగనుంది. దీనికి ముందు నగరంలో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించనున్నారు. సిఐటియూ ఆలిండియా దిగ్గజ నేతలంతా ఈ సభలో ప్రసంగించనున్నారు. ఇప్పటికే ఈనెల 27 నుంచి 'శ్రామిక ఉత్సవ్' పేరుతో ప్రారంభమైన సాంస్కృతిక, సాహిత్య, సంగీత ఉత్సవాలు ఈ మహాసభలకు ముందు అత్యంత ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

నేటి ఉదయం 9.30 గంటలకు ప్రారంభం

బుధవారం ఉదయం 9.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ హాలులో మహాసభ ప్రారంభ సభకు సుమారు 10 ట్రేడ్ యూనియన్‌లకు పైగా జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు హాజరై సౌహార్ధ సందేశాలను ఇవ్వనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రారంభసభ జరుగుతుంది.

పోల'వరాలు' అందేనా ?

- రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ..
- నిర్వాసితులకు న్యాయం జరిగేనా ?



మండలాలు : 12
రెవెన్యూ డివిజన్‌లు : 2
పంచాయతీలు : 186
గ్రామాలు : 827
జనాభా : 3,49,799
పురుషులు : 1,70,465
స్త్రీలు : 1,79, 394
జిల్లా భౌగోళిక విస్తీర్ణం : 6,431. 63

ప్రజాశక్తి-రాజవొమ్మంగి/ఎటపాక:

రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ జిల్లాల (ఏర్పాటు) చట్టం, 1974 ప్రకారం ఉన్న అధికారాలను అనుసరిస్తూ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జీఓ 517 విడుదల చేశారు. ఈ నెల 31న తుది నోటిఫికేషన్ వెలువడనుంది. నూతన సంవత్సరం నుంచి కొత్త జిల్లా పాలన ప్రారంభం కానుంది. గతంలో ఇచ్చిన ప్రతిపాదనలపై ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు,సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ తుది నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం.

పోలవరం జిల్లా స్వరూపం:

కొత్త జిల్లాలో మొత్తం 12 మండలాలు ఉన్నాయి. వీటిని రెండు రెవెన్యూ డివిజన్లుగా విభజించారు. పోలవరం ముంపు ప్రభావిత మండలాలను కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేశారు.

రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి 8 మండలాలు ఉండగా, చింతూరు రెవెన్యూ డివిజన్‌లో ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం (విఆర్‌పురం). 4 మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లను కలిపి కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. సాధారణంగా ప్రతి జిల్లాలో 3 నుంచి 5 నియోజకవర్గాలు ఉండగా, పోలవరం మాత్రం ఏకైక నియోజకవర్గం ఉన్న జిల్లాగా నిలవనుంది.

ప్రత్యేక జిల్లా ఎందుకంటే :

అల్లూరిసీతారామరాజు జిల్లాలో రంపచోడవరం నియోజకవర్గాన్ని విలీనం చేయడం వల్ల ఇక్కడ ప్రజలు జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే 350 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని కొత్త జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. 2022 జిల్లాల పునర్విభజనలో భాగంగా పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటు చేశారు. దీనిపై అప్పట్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. కానీ నాటి ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా గిరిజన జిల్లా ఏర్పాటు చేసింది.

ప్రభుత్వం చెప్తున్న పరిపాలన సౌలభ్యం కుదరదని, ఏజెన్సీ అభివృద్ధి కుంటుపడుతుందని, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగదని సిపిఎంతో పాటు నాటి ప్రతిపక్ష టిడిపి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కూటమి ప్రభుత్వం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పోలవరం ప్రాజెక్టు ప్రభావిత గిరిజన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలు ఆదివాసీ సంఘాలు, గిరిజన ప్రజల నుండి అసంతృప్తి కూడా వ్యక్తం అయింది.

పరిపాలనకు అవసరమైన భవనాలు కష్టతరమే..

పోలవరం నూతన జిల్లాకు పరిపాలన కోసం అన్ని శాఖల కార్యాలయాలు ఏర్పాటు కష్టతరంగా మారనుంది. ప్రస్తుతానికి వైటీసీ, పీఎంఆర్సీ భవనాలలో కలెక్టర్,ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. అన్ని శాఖల కార్యాలయాలకు భవనాలు ఏర్పాటు తలనొప్పిగా మారనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిర్వాసితులకు పరిహారం అందేనా?

పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కాలనీల ప్రాంతాలు అన్నీ పోలవరం జిల్లాలో కలపి ఉంటే భూమికిభూమి కేటాయింపు, రిజర్వేషన్ల పరంగా ప్రయోజనాలు ఉంటాయి.

భూ సంబంధిత సమస్యల పరిష్కారాలు, భూమిలేని కుటుంబాలకు వ్యవసాయ భూ కేటాయింపులు, ప్రాధాన్యత క్రమంలో జరగడానికి, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక, పర్యాటక పాలసీల నిర్దిష్టంగా అమలు చేయడానికి వీలుంటుంది. సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ చేరేందుకు పెండింగ్‌లో ఉన్న పోడుభూములకు ఇచ్చే (ఆర్ఓఎఫ్ఆర్) పట్టా , నిర్వాసిత కాలనీ వాసులకు ఇచ్చే పరిహారం (ఆర్అండ్ఆర్) కూడా అందరికీ అందించేందుకు వీలుండేది. కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో ఇప్పటికైనా పోలవరం నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తే న్యాయం జరిగినట్టు ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'కొమరం' ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని అభిచర్ల గ్రామంలోని కొమరం లక్ష్మీనారాయణ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కొమరం పెంటయ్య అధ్యక్షతన రవ్వ ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ కొమరం లక్ష్మీనారాయణ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా పని చేసారని గుర్తు చేసారు. సిపిఎంలో మచ్చ లేని నాయకుడుగా పేరు పొందారన్నారు. గ్రామీణస్థాయి నుంచి సిపిఎం కార్యకర్తగా సభ్యునిగా అనతి కాలంలోనే పలు పోరాటాలకు రూపకల్పన చేసి సమస్యలు పరిష్కా రానికి కృషి చేసారని ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచ్ సోడె శంకర్, కుటుంబ సభ్యులు లక్ష్మి, కొమరం ప్రభాకర్, భీష్మారావు, రామకృష్ణ, శాంతి,కిషోర్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

సిపిఎం నేత అప్పలరాజుపై..
పీడీ యాక్టు సరికాదు

- జెడ్‌పి సమావేశంలో సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, పలువురు సభ్యుల ధ్వజం
- తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- పలు సమస్యల ప్రస్తావన

మాట్లాడతున్న ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

నక్కపల్లి మండలం రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారులకు మద్దతు తెలిపిన సిపిఎం నాయకుడు ఎం.అప్పలరాజును పీడీ యాక్టు కింద అరెస్టు చేసి జైలుకు పంపడం సరికాదని అనంతగిరి మండల సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకునిపై పీడీ యాక్టు ప్రయోగించడం చట్ట విరుద్ధమన్నారు. అప్పలరాజుపై తక్షణం పీడీ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్ పాల్గొన్న ఈ సమావేశంలో అప్పలరాజు అక్రమ అరెస్టుపై గంగరాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంజాయి మాఫియా, దారి దోపిడీదారులపై వాడాల్సిన పీడీ యాక్ట్‌ను ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై ప్రయోగించడం అన్యాయమన్నారు. గతంలో ఇదే జిల్లా పరిషత్ సమావేశంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయాన్ని గంగరాజు గుర్తు చేశారు.

మాట్లాడుతున్న గంగరాజు

నక్కపల్లి జెడ్పిటిసి గోసల కుశలమ్మ మాట్లాడుతూ, తమ మండలంలో ప్రజా సమస్యలపై నిత్యం పనిచేసే నాయకుడు అప్పలరాజు అని, బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు పోరాటం ప్రారంభిస్తే దానికి అప్పలరాజు మద్దతు ఇచ్చారని, మత్స్యకారులను ప్రేరేపించడంలో ఆయన పాత్ర లేదని స్పష్టం చేశారు. అటువంటి నాయకునిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. మరి కొంతమంది జెడ్‌పిటిసి సభ్యులు కూడా అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగాన్ని వ్యతిరేకించి గంగరాజు, కుశలమ్మ డిమాండ్‌కు మద్దతు తెలియజేశారు.

అర్హులైన వికలాంగులకు పింఛన్లు అందించాలి

అర్హులైన వికలాంగులకు పెన్షన్లు అందటం లేదని, అనర్హులకు మాత్రం పెన్షన్లు మంజురవుతున్నాయని అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నిజమైన అర్హులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అల్లూరి జిల్లా డిఎంహెచ్ఓ పనితీరు బాగోలేదు

అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెడ్పీ సమావేశాలకు హాజరు కాకపోవడం సరికాదని, జిల్లాలో కూడా ఆయన పనితీరు సక్రమంగా ఉండటం లేదని, ముఖ్యంగా అల్లూరు జిల్లాలోని పిహెచ్‌సిల పనితీరుపై ఆయన పర్యవేక్షణ ఉండటం లేదని అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు విమర్శించారు. అనంతగిరి మండలం రోంపల్లి పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఎంపిహెచ్ఓ, సబ్ సెంటర్ ఎఎన్ఎం, సచివాలయం ఎఎన్ఎంలను డెప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపించారని, ఈ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతగిరి కొత్తవలస బాలుర ఆశ్రమ పాఠశాలలో వసతి గృహానికి నూతన భవనం నిర్మించడానికి నిధులు కేటాయించాలని కోరారు. అల్లూరి జిల్లాలో రోడ్లు అనేక చోట్ల అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయని, ఎన్ఆర్ఈజిఎస్ నిధులు విడుదల చేసి వాటిని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అరకు జెడ్పిటిసి శెట్టి రోషిణి మాట్లాడుతూ, అరకు మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటిని తక్షణం మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

క్రికెటర్ పాంగి కరుణ కుమారికి సత్కారం

సమావేశం ప్రారంభంలో అంతర్జాతీయ వేదికపై మెరిసిన టీ20 ఉమెన్ అంధుల క్రికెట్ టీమ్ సభ్యురాలు పాంగి కరుణకుమారిని ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ తరపున ఆమెకు రూ.39,900 విలువైన క్రికెట్ కిట్‌ను అందజేశారు.

సత్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, కలెక్టర్లు

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2026-2027 సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌కు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై అధికారులు నివేదికలు సమర్పించారు.

విద్యార్థిని మృతిపై ఎడిఎంహెచ్ఓ విచారణ

ప్రజాశక్తి -సీలేరు:

జికెవీధి మండలం సీలేరు గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని పాంగి నందిని మృతికి వైద్యాధికారి కారణమంటూ వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో అల్లూరి జిల్లా ఎడిఎంహెచ్ఓ డాక్టర్ ప్రతాప్ స్పందించారు. మంగళవారం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యాధికారి నారాయణరావు, ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగశకుంతలతో మాట్లాడి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్‌హాల్‌కు చేరుకుని విద్యార్థినిలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు మంచి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రతినెలా పిహెచ్‌సి సిబ్బంది విద్యార్థులకి వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నందిని మృతి తీవ్ర ద్రిగ్భాంతిని కలిగించిందని వాపోయారు. మంగళవారం విద్యార్థులకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నందిని మృతికి బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రెగ్యులర్ వైద్యాధికారుల కొరత వలన డిప్యూటేషన్ ప్రాతిపదికపై సీలేరు, ధారకొండ, సప్పర్ల పిహెచ్‌సిలో వైద్యాధికారులను నియమించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి రెగ్యులర్ వైద్యాధికారుల నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు.

పూర్తి స్థాయి వైద్యాధికారులు లేకపోతే తాళం వేయండి

సీలేరు, ధారకొండ, సప్పర్ల పిహెచ్‌సిలకు పూర్తి స్థాయి వైద్యాధికారులు నియమించకపోతే ఆసుపత్రికి తాళం వేయాలని దండకారణ్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్కురాజు ఎడిఎంహెచ్ఓ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమపాఠశాలలకు ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు వారి పిల్లలను పంపుతున్నారని చివరికి వారు విగతజీవులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి 24 గంటలు వైద్యాధికారితోపాటు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీలేరు దారకొండ వైద్యాధికారులు నారాయణరావు, బాబ్జి హెల్త్ సూపర్‌వైజర్ త్రినాధ ఆశ్రమం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న ఎడిఎంహెచ్ఓ డాక్టర్ ప్రతాప్

భవనం పగుళ్లు పరిశీలిస్తున్న ఎంపిపి కారంలక్ష్మి, సిపిఎం నాయకులు

నాసిరకం నిర్మాణంతోనే భవనానికి పగుళ్లు

- ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన సిపిఎం నాయకులు
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీలో ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఎంపిపి కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు పరిశీలించారు. ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ భవనం ప్రారంభమై రెండేళ్లు కాకముందే గోడలు పగుళ్లు తేలిందని, ఫ్లోరింగ్ కూడా కుంగిపోయిందని, నిర్మాణం వెనుక అప్పట్లో అధికారంలో ఉన్న మండల నాయకుడు హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. తక్షణమే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ప్రదీప్‌కుమార్ మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-గంగవరం: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు గంగవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి తెలిపారు. ఒక గిరిజన మహిళ, శాసన సభ్యురాలు అని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఈ విషయమై గంగవరం ఎస్సై వెంకటేష్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాము అర్జున్, మాజీ ఎంపిపి తీగల ప్రభ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

బొకేలను తయారు చేస్తున్న కార్మికులు

సిఐటియు మహాసభకు ఫ్లవర్ బొకేలు తయారీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిలభారత మహాసభ కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఈ మహాసభలో పాల్గొనబోయే కార్మిక అగ్రనాయకులు, ప్రతినిధులకు స్వాగతించేందుకు అల్లూరి జిల్లా, అరకులోయ మండలంలోని పద్మావతి గార్డెన్ వద్ద కార్మికులు ప్రత్యేకంగా ఫ్లవర్ బొకేలు తయారు చేస్తున్నారు. ఈ బొకేలు మహాసభలో పాల్గొనేవారికి ప్రత్యేకంగా స్వాగతంగా ఇస్తారు.స్థానికులు, కార్మిక సంఘాల సభ్యులు బొకేలను అందంగా అలంకరించేందుకు ప్రత్యేక శ్రద్ధతో తయారు చేస్తున్నారు.

ఎన్నికైన జాబితాను ఇస్తున్న సభ్యులు

గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -పాడేరు:అఖిలభారత షెడ్యూల్డ్ గిరిజన ఉద్యోగుల అసోసియేషన్ అల్లూరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు పాడేరులో ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా మాసాడ ఈశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ముఖి శేషాద్రి ఉమెన్స్ కార్యదర్శిగా శెట్టి శాంత కుమారి నియమితులయ్యారు. కోశాధికారిగా కొండలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మినుముల ప్రసాదరావు నియమితులయ్యారు. జోన్ 1 అరకు ప్రాంతానికి ఉపాధ్యక్షుడిగా సుబ్బారి గురు దొర, సంయుక్త కార్యదర్శిగా పాంగి సందొ, కార్యవర్గ సభ్యులుగా పెట్టెలి ఆనందరావు, కొర్ర అమ్మర్, కొర్ర రమేష్, జోన్ 2 పాడేరు నుంచి వైస్ ప్రెసిడెంట్ గా రేగం. అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కూడా ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా బి.రామచంద్ర రాజు, సిహెచ్ యువరాజు, నందోలి మహేష్, జోన్ 3 పెదబయలు నుంచి ఉపాధ్యక్షుడిగా చండా బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఫలాసి తిరుపతిరావు, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి కమల కుమారి, పల్లుల లింగన్న ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జి వి వి ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు పలాసి కృష్ణారావు వ్యవహరించారు.

చెత్త తొట్టెలు ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలో చెత్త తొట్టెలను స్థానిక సిపిఎం సర్పంచ్ సోమెల .రూతు, కార్యదర్శి సిఎస్ .దేవ ఆధ్వర్యంలో రోడ్డు పొడవున ఏర్పాటు చేశారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ముఖద్వార మైన అనంతగిరి హెడ్ క్వార్టర్ పంచాయతీ రోడ్డు ఇరువైపులా తడి పొడి చెత్త తొట్టెలను ఏర్పాటు చేశామని, చెత్తను స్థానిక ప్రజలు వీటిలో వేయాలని సూచించారు. ఈ తడి పొడి చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్. శేఖర్ బాబు, గిరిజన సంఘం మండల నాయకులు ఎస్.నాగులు, మామిడి .కృష్ణ పాల్గొన్నారు.

ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ రూతు

రాళ్లు తేలిన రహదారి

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని బొకురు పంచాయతీ పరిధి అరకు మెయిన్ రోడ్డు ములియగూడ నుండి రాయివలస మీదుగా కంబవలస నిమ్మలపాడు మెయిన్ రోడ్డుకు ఆనుకొని నిర్మించిన తారు రోడ్డు కంకర రాళ్లు తేలి గోతులు మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత 15 ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. అప్పటి నుండి నేటి వరకు కనీసం మరమ్మతు పనులు చేపట్టక పోవడంతో ఆ రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది.ఈ రోడ్డుకు ఆనుకుని సుమారు 8 గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న దముకు మెయిన్ రోడ్డులో ఏమైనా సమస్య తలెత్తినప్పుడు అధికమంది ప్రయాణికులు ఈ మార్గాన దముక్కు నుండి మూలియగూడ అరకు మెయిన్ రోడ్డు కు చేరుకుంటారు. ఇటు బొర్రా, అటు అనంతగిరి మీదుగా అరకు ప్రయాణం కొనసాగిస్తుంటారు. కూటమి ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ప్రకటనలు చేస్తుందే తప్ప మరమ్మతు పనులు చేపట్టిన దాఖలు లేవు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాళ్లు తేలి ఉన్న రహదారి

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మాట్లాడుతున్న పీసా కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని గలగండ పంచాయతీలో అభివృద్ధి పనులు చేయకుండానే 15వ ఆర్థికసంఘం నిధులను స్థానిక సర్పంచ్ లోహిదాసు, కార్యదర్శి గెమ్మలి స్వాహా చేశారని స్థానిక పీసా కమిటీ సభ్యులు, ప్రజలు ఆరోపించారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందన లేకపోవడంతో, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి 19మంది సంతకాలతో కూడిన లిఖితపూర్వక ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గలగండ పంచాయతీకి 2019 నుంచి 2025 వరకు వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన రూ.79,355 నిధులను ఎటువంటి పనులు చేయకుండా సర్పంచ్, కార్యదర్శి డ్రాచేసి స్వాహాచేశారని ఆరోపించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, ఇతర పనులకు వెచ్చించాల్సిన ఆర్థికసంఘం నిధులను ఆయా పనులు చేయకుండానే స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని మండిపడ్డారు. దీంతో పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు 19మంది సంతకాలతో డిప్యూటీ సిఎం పవన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి పాడేరు: రైతు సాధికార సంస్థ (ఆర్ వై ఎస్ ఎస్) ఆధ్వర్యంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీ సీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి బాబురావునాయుడు, డీపీయం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన ఐటిడిఎ డిపిఎలకు నాలుగు రోజుల ఇమర్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా డీపీఎంలకు ప్రకృతి వ్యవసాయం అమలు విధానం, సంస్థాగత నిర్మాణం, జిల్లా స్థాయి బాధ్యతలు, గిరిజన,కొండ ప్రాంతాల్లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ నమూనాలపై అవగాహన కల్పించారు. ఇమర్షన్‌లో భాగంగా డీపీఎంలు పాడేరు, గొందివలస, డుంబ్రిగూడ, హుకుంపేట, పొదిలి, డోకులూరు మరియు జి. మడుగుల మండలాల్లోని ప్రకృతి వ్యవసాయ మోడల్ క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇమర్షన్ ద్వారా పొందిన అనుభవాలు, నేర్చుకున్న అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న డిపిఎంలు

రిసోర్స్‌పర్సన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒత్తిళ్లను అధిగమించడంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి,-చింతపల్లి: ఒత్తిళ్లను అధిగమించడంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిఎం ఉషశ్రీ, పాడేరు డిగ్రీ కాలేజీ సౌజన్యంతో నిర్వహించిన అవగాహన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస పాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్, హెల్దీ లైఫ్ టెక్నిక్స్, పోస్టర్ విజువల్ క్యాంపెయినింగ్ అంశాలపై విశాఖపట్నం నుంచి వచ్చిన ప్రవీణ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాజంలో ఎదురయ్యే వివిధ ఒత్తిళ్లను అధిమించడంపై విద్యార్థులు అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌నకు కోఆర్డినేటర్‌గా ఐ. రవీంద్ర నాయక్ కన్వీనర్లుగా వంతల ఈశ్వరరావు, శ్రీనివాసరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని మత్స్యపురం పంచాయతీ బంగారు మెట్ట గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. జడ్పీ నిధులతో నూతన బోరు ఏర్పాటు కోసం మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కిల్లో మీనా కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మీనా కుమారి మాట్లాడుతూ, జడ్పీ నిధుల ద్వారా సుమారు రూ. లక్ష 20 వేల వ్యయంతో బంగారు మెట్ట గ్రామంలో నూతన బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్థులు ఊట నీటిపై ఆధారపడాల్సి వచ్చిందని, ఈ సమస్యను అధికారుల దష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లో సాంబ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై కాఫీ రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి జి.మాడుగుల: కిలో కాఫీకి రూ.70 చెల్లిస్తామని ప్రకటించిన ఐటిడిఏ అధికారులు రూ.60 మాత్రమే చెల్లించడంతో గిరిజన కాఫీ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారులు కిలో కాఫీకి రూ.80 నుంచి రూ.100 వరకు చెల్లిస్తున్నారని, ఐటిడిఏ ఆధ్వర్యంలో తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. మంగళవారం జి.మాడుగులలో ఐటిడిఏ కాఫీ ఏడి లకే బొంజు బాబు ఆధ్వర్యంలో నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు కాఫీ ఏడిని నిలదీయగా, కిలోకు పెరిగిన రూ.10ను త్వరలోనే రైతుల అకౌంట్లకు జమ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విధంగానే కొనసాగితే వచ్చే ఏడాది ఐటిడిఏకు కాఫీ విక్రయించేది లేదని రైతులు తేల్చి చెప్పారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-కాశీపట్నం:అనంతగిరి మండలం వెలగలపాడు, మెట్టవలస, వంతెనగరువు, ఎరమెట్టలో వృదులకు జై భారత్ నేషనల్ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు బడ్నాయిన చంటి బాబు,ఎంపిహెచ్ఈఓ బాకా సంజీవరావు, లుంగపర్తి పోస్ట్ మాస్టర్ బడ్నాయిన శ్రీనువాసరావు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రశాంత్‌బాబు, లుంగపర్తి పోస్ట్ మాస్టర్ బడ్నాయిన శ్రీనివాస్‌రావు, స్థానిక పాస్టర్ బడ్నాయిన గిర్జొన్, ఇమ్మానుయేలు, జాన్ పాల్ పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి-సీలేరు: నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి సంబరాల్లో అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపడుతున్నామని సీలేరు ఎస్ఐ యాసీన్ వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకి పాల్పడితే కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలిస్తామన్నారు..

కొయ్యూరు: నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కొయ్యూరు స్టేషన్ ఆవరణలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, హెల్మెట్ ధరించకపోయినా అనుమతి లేకుండా రోడ్డుపై వేడుకలు, డీజేలు ఏర్పాటు చేయడం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా ఫిర్యాదు చేయాలంటే డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలన్నారు. కొయ్యూరు, మంప ఎస్సైలు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రహరీకి శంకుస్థాపన

ప్రజాశక్తి- విఆర్‌పురం : రేఖపల్లి పంచాయతీలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రి 100 మీటర్ల ప్రహరీ నిర్మాణానికి ఎనర్జీస్ నుంచి రూ.10లక్షలు మంజూరు కావడంతో మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ పూనం సరోజిని, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని దీని కోసం ఎనర్జీస్ నిధులతో ప్రహరీ నిర్మిస్తున్నట్టు తెలిపారు. పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కారం సుందరయ్య, మండల నాయకులు పొడియం శ్రీరామ్ మూర్తి, కమ్మచిచ్చు సత్యనారాయణ, గుండుపూడి లక్ష్మణరావు, సిరప్ తాతబాబు, ప్రకాశరావు, హాజరత్, పీసా కమిటీ సభ్యులు సారా పాండురాజు, కార్యదర్శి వేటగాని సూరి, ఎనర్జీస్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి లక్ష్మి

ఆదివాసీ విద్యార్థులపై శ్రద్ధ ఇదేనా ?

దండకారణ్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్కురాజు, జిల్లా కార్యదర్శి మనోజ్

ప్రజాశక్తి -సీలేరు: ఆదివాసీ విద్యార్థుల బాగోగులపై అధికారులు, ప్రజాప్రతినిధు లకు శ్రద్ధ లేదని దండకారణ్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్కురాజు,జిల్లా కార్యదర్శి మనోజ్ ఒక ప్రకటనలో విమర్శించారు. సీలేరు బాలికల గిరిజన సంక్షేమశాఖ హాస్టల్లో విద్యార్థిని నందిని మృతి చెందిన ఘటనపై విచారణ చేసామని, పాఠశాలలో పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయులు లేరని 271 విద్యార్థులకు ఒక్కరే కుక్ ఉన్నారని, సిక్‌రూమ్‌కు వైద్య సిబ్బంది లేరని ఆరోపించారు. రెండు మూడు సంవత్సరాల్లో వందలాదిమంది అనారోగ్యానికి గురై మృతి చెందారని దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలకు రెగ్యులర్ హెచ్‌ఎంను నియమించి విద్యార్థులకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాప్ పరిసరాలు

మూలకుచేరిన కుళాయిలు

చింతూరు ఆర్టీసీ బస్టాండ్

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్యం క్షీణించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉంది. ప్రయాణికులు కూర్చునే బల్లలు కూడా విరిగిపోయి ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయి మద్యం సీసాలు మరుగుదొడ్లల్లో దర్శనమిస్తున్నాయి. కనీసం మూత్రశాలలు కూడా శుభ్రంగా లేకపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. బస్టాండ్ చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం, పెరిగిన పిచ్చి మొక్కలతో దయనీయంగా ఉంది. రాత్రి సమయాల్లో బిచ్చగాళ్లు బల్లలపై పడుకుని బస్టాండ్ ఆవరణలోనే చలిమంటలు వేసుకుంటున్నారు. ప్రయాణికులకు మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్‌కు వేసినషెడ్డు ఇనుప పైపులు తుప్పు పట్టి పోయాయి. రాత్రీ పగలు తేడా లేకుండా బస్టాండ్ లో ఫ్యాన్లు లైట్లు వేసి ఉండటంతో విద్యుత్ పరికరాలు త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. బస్టాండు నిర్వహణకు గతంలో ఒక ఉద్యోగి ఉండేవారు. అప్పుడు కొంతవరకు బస్టాండు శుభ్రంగా ఉండేది. ఆ ఉద్యోగిని తొలగించడంతో బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. అధికారులు ఇప్పటికైనా ఆర్టీసీ సంస్థ చొరవ చూపి బస్టాండ్ నిర్వహణకు కావలసిన ఉద్యోగిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

ప్రజాశక్తి - రాజఒమ్మంగి : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని రాజఒమ్మంగి ఎస్ఐ శివకుమార్ అన్నారు. స్థానిక పిఎంఎస్ కాలెజి బాలికల వసతిగృహంలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, శక్తి యాప్, ఈవ్‌టీజింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్‌పురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై సంతోష్ కుమార్, ఎఎస్ఐ రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్ , మత్తులో పిల్లలపై అఘాయిత్యాలు వంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

చెత్తసేకరణపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ మౌనిక

తడి,పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు: తడి చెత్త, పొడిచెత్త వేర్వేరు డస్ట్‌బిన్‌ల్లో వేయాలని రాజేంద్రపాలెం సర్పంచ్ మౌనిక సూచించారు. మంగళవారం ఆమె రాజేంద్రపాలెం, సురేంద్ర పాలెంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. మహిళలంతా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి స్థాయి ఎటిడబ్ల్యూఒని నియమించాలి

ప్రజాశక్తి-జికెవీధి: మండలానికి ప్రత్యేకంగా పూర్తిస్థాయి ఎటిడబ్ల్యూఒని నియమించాలని గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులు మృత్యువాత పడుతున్న సంఘటనలు జరగకుండా మండలానికి పూర్తి స్థాయి ఎటిడబ్ల్యూను నియమిస్తే నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్స్, కుక్‌లను కూడా పూర్తి స్థాయిలో నియమించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నేడు మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. రాజవొమ్మంగి సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ వెంకటరమణ మంగళవారం తెలిపారు. అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.

న్యూ ఇయర్ వేడుకలకు పోలీసు ఆంక్షలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : 2026 నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి డిసెంబర్ 31 రాత్రి నుండి జనవరి 1 తెల్లవారుజాము వరకు ప్రత్యేక ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు బీచ్ రోడ్డు (పార్క్ హోటల్ నుండి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు), ఫ్లై ఓవర్లపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయబడతాయని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 జరిమానా జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామన్నారు

సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ పోరాటం

ప్రజాశక్తి-కూనవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కన్నారావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శిని, పదోతరగతి న్యూమోడల్ టెస్ట్ పేపర్‌ను ఎంపిడిఒ జగనాథరావు ఆవిష్కరించారు. అనంతరం ఎంపిపి పాఠశాలలో కార్యవర్గ సమావేశం అధ్యక్షులు నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నారావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం రద్దు, పాతపెన్షన్ పునరుద్దరణ, టెట్ నుండి 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులను మినహాయించాలనే డిమాండ్‌పై జనవరి 29న ఢిల్లీలో మహాధర్నా ఉంటుందని తెలిపారు.

వి.ఆర్.పురం: యుటిఎఫ్ 2026 డైరీని మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ వద్ద ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశానికి మండల ప్రధాన కార్యదర్శి జగదీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌పురం: కేలండర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రంపచోడవరం/గంగవరం: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ రూపొందించిన 2026 డైరీ, క్యాలెండర్, జీఓ పుస్తకాలను ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ మంగళవారం ఆవిష్కరించారు. మెరుగైన బోధన చేసి గిరిజనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పోలవరం జిల్లా అధ్యక్షులు విశ్వరాజ్, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి సూరిబాబు, మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

గంగవరం: 2010 విద్యాహక్కు చట్టం కంటే ముందుగా నియమితులైన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని గంగవరం మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం బొజ్జిదొర, చదల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిపి స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ టెట్ వల్ల ఉపాధ్యాయులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు రుక్మిణిదేవి, గౌరవ అధ్యక్షులు రాంబాబుదొర, కోశాధికారి సత్యకిరణ్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు వెంకన్నదొర, కారం లక్ష్మి, కారం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.